# గుట్కా తింటే.. కేన్సర్!

- నిషేధం ఉన్నా దొంగచాటుగా అమ్మకాలు
- చోద్యం చూస్తున్న అధికారులు
- బాలానగర్, ఫతేనగర్ ప్రాంతాల్లో ఎక్కువగా విక్రయాలు

**రోజురోజుకు గుట్కాలు తినే వారి సంఖ్య పెరుగుతోంది. గుట్కాల అమ్మకంపై నిషేధం ఉన్నా కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని చాలా ప్రాంతాల్లో యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు గుట్కా అమ్మకాలపై ఎలాంటి చర్యలూ తీసుకోవడంలేదనే విమర్శలున్నాయి.**

**- బాలానగర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి)**

గుట్కాల వాడకం, అమ్మకాలపై నిషేధం ఉన్నప్పటికీ కొందరు వ్యాపారులు మాత్రం ఆపడం లేదు. కొందరు వ్యాపారులు పొరుగు రాష్ట్రాల నుంచి గుట్టుచప్పుడు కాకుండా గుట్కా ప్యాకెట్లను తీసుకొచ్చి దొంగచాటుగా అమ్ముతున్నారు. పాన్ షాపులు, చిన్నచిన్న కిరాణా షాపులు, చాయ్ కొట్ల వ్యాపారులు రాత్రి పగలు తేడా లేకుండా విక్రయిస్తున్నారు. అధికారులు తనిఖీలు చేపట్టినప్పుడు దాచి పెడుతున్నారు.

### వలసదారులు ఉండే ప్రాంతాల్లో...

బిహార్, యూపీ, రాజస్థాన్, జార్ఖండ్ రాష్ట్రాల నుంచి హైదరాబాద్‌కు వలసొచ్చి పారిశ్రామిక వాడలు, మురికివాడల్లో నివాసం ఉంటున్న వారికి గుట్కా, పాన్ పరాగ్‌లు విక్రయిస్తున్నారు. బాలానగర్, ఫతేనగర్, మూసాపేట్, జగద్గిరిగుట్ట, జీడిమెట్ల, సూరారం కాలనీ, గాజుల రామారం, ప్రశాంత్‌నగర్ లాంటి ప్రాంతాల్లో గుట్కాలు ఎక్కువగా విక్రయిస్తున్నారు. బిల్డింగ్ నిర్మాణంలో మేస్త్రీలు, లారీ డ్రైవర్లు, హెల్పర్లు, పరిశ్రమల్లో కార్మికులు రాత్రి పనిచేసే సమయంలో నిద్ర రాకుండా గుట్కాలు, పాన్ పరాగ్, జర్దా లాంటివి ఎక్కువగా తీసుకుంటారని కొందరు వ్యాపారులు చెబుతున్నారు. మరి కొందరు చిగుళ్ల నుంచి రక్తం కారడం, చిగుళ్ల వాపులు, పంటి నొప్పులు, నోటి దుర్వాసన నుంచి విముక్తి పొందడానికి జర్దా, పాన్‌పరాగ్, గుట్కాలు వాడుతున్నారని పాన్ షాప్ నిర్వాహకులు చెబుతున్నారు.

### వీటితో నోటి కేన్సర్

గుట్కాలు తినడంవల్ల నోటి కేన్సర్ గురవుతారని వైద్యులు సూచిస్తున్నారు. గుట్కాను దవడ, దంతాల మధ్య ఉంచుకోవడంవల్ల దానిలో ఉన్న కార్సినోజెనిక్ పదార్థం దవడ భాగాన్ని తినేస్తుందని, ఓరల్ సబ్‌మ్యూకస్ ఫైబ్రోసిస్‌కు గురవుతారని వైద్యులు చెబుతున్నారు. నోటిలో మొదట మంట తర్వాత దవడలు సాగేగుణం సన్నగిల్లి నోరు తెరవలేని స్థితికి చేరుకుంటుందన్నారు. శరీరంలో ఏ భాగానికైనా కేన్సర్ వస్తే ఆ భాగంలో కొంత తీసివేయాల్సి వస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. నాలుకకు వస్తే నాలుక, బుగ్గకు వస్తే బుగ్గ, పెదవికి వస్తే పెదవిని కోసి తొలగించాల్సిందే నని వివరిస్తున్నారు.



**నోటి కేన్సర్ లక్షణాలు**

1. నోటిలో మానని తెల్లమచ్చలు, పుండ్లు
2. రెండు వారాలకు పైగా మానని పుండు
3. నోటిలో గడ్డలు
4. నోరు తెరవలేక పోవడం, తిన్న ఆహారాన్ని నమలలేక పోవడం
5. మెడ దవడ వద్ద గడ్డ లేదా వాపు
5. గుట్కా జర్దా పెట్టుకున్న చోట చిగుళ్ల వ్యాధులు, చిగుళ్ల నుంచి రక్తస్రావం, పళ్ళు వదులు కావడం.

### దేశంలో నోటి కేన్సర్ 2వ స్థానం



భారత దేశంలో అత్యధికంగా వచ్చే కేన్సర్లలో నోటి కేన్సర్ రెండో స్థానంలో ఉంది. నోటీ కేన్సర్ పురుషుల్లో మొదటి స్థానంలో ఉంది. పొగాకు, గుట్కాలు, పాన్ పరాక్‌లు, పాన్ మసాలాలు తినే వారికి 90 శాతం నోటి కేన్సర్లు వచ్చే అవకాశం ఉంది. జీర్ణకోశ వ్యవస్థపై కూడా దీని ప్రభావం ఉంటుంది. గుట్కాలకు బానిసలు కాకుండా ఉండాలి. పూర్తిగా బానిసైన వారికి వైద్యులు డీ అడిక్షన్ ట్రీట్‌మెంట్ ద్వారా మాన్పించే ప్రయత్నం చేస్తారు.

- డా. స్వరూపా, మెడికల్ అంకాలజిస్ట్, రామ్‌దేవ్‌రావు ఆస్పత్రి, కూకట్‌పల్లి

### విక్రయిస్తే చర్యలు



ప్రాణానికి హాని కల్గించే గుట్కాలపై ప్రభుత్వం నిషేధం విధించింది. వీటిని తినేవారిపై, విక్రయించిన వారిపై చర్యలు ఉంటాయి. బాలానగర్ సీఐగా బాధ్యతలు చేపట్టిన ఈ కొద్ది రోజుల్లో గుట్కాలు, పాన్‌పరాక్ విక్రయిస్తున్న దుకాణాలు, పాన్‌షాపుల్లో తనిఖీలు చేసి అమ్మకాలు జరుపుతున్న నలుగురిపై కేసులు నమోదు చేశాం. నిరంతరం తనిఖీలు కొనసాగుతూనే ఉంటాయి. గుట్కాలకు భానిసైన వారు ప్రాణాలు కోల్పోతే కుటుంబం రోడ్డున పడుతుందనే విషయాన్ని గమనించాలి. నోటి కేన్సర్‌కు గురి చేసే గుట్కాలు, పాన్ పరాక్‌లు తినకూడదు.

- నర్సింహరాజు, సీఐ, బాలానగర్

---

## ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు

- కేపీహెచ్‌బీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జానయ్య



ఇంటర్వ్యూ

దక్షిణ భారతదేశంలోనే అతిపెద్దకాలనీగా ఏర్పడిన హౌసింగ్‌బోర్డు కాలనీ నిత్యం ట్రాఫిక్ కష్టాలతో సతమతమవుతోంది. నాయకులు, అధికారులు చొరవతో లింకు రోడ్లపై ఫ్లైఓవర్లు నిర్మించిన వాహనదారులకు నిత్యం ట్రాఫిక్ కష్టాలు ఎదురవుతూనే ఉన్నాయి. కేపీహెచ్‌బీ కాలనీలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు, అనుసరిస్తున్న విధానాలపై కేపీహెచ్‌బీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జానయ్య ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో పలువిషయాలు వెల్లడించారు.

- హైదర్‌నగర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి)

**కేపీహెచ్‌బీలో ట్రాఫిక్ నియంత్రణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?**

కేపీహెచ్‌బీలో జనసాంద్రత ఎక్కువగా ఉండడంతో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వీటిని నివారించేందుకు పలు చర్యలు చేపడుతున్నాం. రద్దీ సమయాల్లో ప్రత్యేక ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నాం. ట్రాఫిక్ ఎక్కువగా ఉన్నప్పుడు కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి, పై అధికారుల నుంచి వచ్చే ఆదేశాల ప్రకారం నడుచుకుంటాం. ట్రాఫిక్ ఎక్కువగా ఉన్నప్పుడు అవసరమైన చోట రీ బారికేడింగ్ ఏర్పాటు చేసి యూటర్న్ ద్వారా ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నాం.

**రోడ్డు ఆక్రమణల దృష్ట్యా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?**

ట్రాఫిక్ అంతరాయం కలిగించే కొన్ని ప్రాంతాలను గుర్తించాం. ఆయా ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీ అధికారులతో సమన్వయం చేసుకొని వాహనాలు సజావుగా రాకపోకలు సాగించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. మూడురోజుల క్రితం నిజాంపేట రోడ్డు ఆక్రమణలను తొలగించాం. రోడ్డు ఆక్రమణలపై ఎప్పటికప్పుడు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నాం.

**రాంగ్‌రూట్లో ప్రయాణంపై నియంత్రనకు ఏమిచేస్తున్నారు?**

కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రెమిడీ హాస్పిటల్, నిజాంపేట్ రోడ్డు, హైదర్‌నగర్, జేఎన్‌టీయూ రోడ్డులో సమస్య ప్రాంతాలను గుర్తించాం. అక్కడ నిత్యం సిబ్బందిని నియమించి చలానాలు విధిస్తూ రాంగ్ రూట్లో ప్రయాణించకుండా నియంత్రిస్తున్నాం.

**వాహనదారులకు మీరిచ్చే సహాలు సూచనలు?**

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడంతో పాటు ట్రాఫిక్ సూచనలు ఖచ్చితంగా పాటించాలి. వాహన దారులు వాహనం నడుపుతున్న సమయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వేగ నియంత్రణలో వాహనం నడపాలి. రోడ్డుపై వాహనాలు పార్కు చేయకుండా నిర్దేశించిన పార్కింగ్ స్థలంలో మాత్రమే వాహనాలను నిలపాలి. ట్రాఫిక్ రద్దీ ఏర్పడకుండా ప్రజలు కూడా సహకరిస్తే ట్రాఫిక్ సమస్య తగ్గే అవకాశం ఉంటుంది.

---

ఆధార్, ఫోన్ నంబర్లు ఇవ్వండి చాలు..

## మిగిలినవి వాళ్లే నింపుకుంటారు

- ఇంటింటి కుటుంబ సర్వేలో విచిత్రాలు

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి, మూసాపేట్ సర్కిళ్ల పరిధిలో సమగ్ర కుటుంబ సర్వే మందకొడిగానే జరుగుతోంది. క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించాల్సిన ఎన్యుమరేటర్లకు ఇచ్చిన బుక్‌లెట్‌లో పూర్తిస్థాయి వివరాల సేకరణ ఎలా నింపాలో కూడా తెలియడం లేదు. బాలాజీనగర్‌లో ఓ అపార్ట్‌మెంట్‌కు వచ్చిన ఎన్యుమరేటర్ నింపి ఇవ్వండని చెప్పారు. ఎక్కడ ? ఎలా ? అంటే అవేమీ వద్దులే మీ ఆధార్ నంబర్లు, ఫోన్ నంబర్ ఇవ్వండి తర్వాత వాళ్లే నింపుకొంటారని చెప్పడం ఆశ్చర్యానికి గురిచేసిందనే చెప్పొచ్చు.

మూసాపేట్‌లో ఇలాగే మాది ఆంధ్ర... మాకు ఇక్కడ ఏమీ లేదు... ఏమి చేయమంటారు..? మీకు తెలిసింది రాసివ్వండి.. తర్వాత మీ ఫోన్ నంబర్‌కు ఫోన్‌చేసి వివరాలు కావాలంటే అడుగుతారని చెప్పి ఎన్యుమరేటర్లు చకచకా ముందుకు వెళ్లిపోతున్నారు. సూపర్ వైజర్ల పర్యవేక్షణ కొరవడడంతో ఎన్యుమరేటర్లకు ఉన్న అవగాహనతో అరకొర వివరాలతోనే సమగ్ర కుటుంబ సర్వే జరుగుతోంది. కులం అనుబంధ కాలం లేకపోవడంతో ఎన్యుమరేటర్‌ను అడిగితే తెల్లమొఖం వేయడం తప్ప సదరు వ్యక్తి నుంచి ఎటువంటి సమాధానం లేదు. సర్వే దరఖాస్తులు నింపాల్సింది ఎవరు? అనేదానిపై కూడా సరైన అవగాహన లేకపోవడం ఉన్నతాధికారుల పర్యవేక్షణ అంతంత మాత్రంగానే ఉండడంతో ఎక్కడా పూర్తివివరాలతో సర్వే జరుగుతుందన్న దాఖలాలు కన్పించడం లేదు.

## సర్వేలో ఇబ్బందులు ఉన్నాయా?

- క్షేత్రస్థాయిలో ఐబీ అధికారుల ఆరా

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వే పనితీరును క్షేత్రస్థాయిలో ఐబీ (ఇంటిలిజెన్స్ బ్యూరో) అధికారులు ఆరా తీశారు. ఈ మేరకు కేపీహెచ్‌బీలో ఎన్యుమరేటర్లను కలిసి మీకు సర్వేలో ఏమైనా ఇబ్బదులు ఉన్నాయా? అసభ్యంగా ప్రవర్తిస్తున్నారా? బెదిరింపులు లాంటివేమైనా ఉన్నాయా? ఇతరత్రా వ్యక్తుల నుంచి మీకు ఏమైనా ఇబ్బంది ఉందా అంటూ ప్రశ్నలు గుప్పించి మరీ సమాధానాలు రాబట్టారు. మాకు ఇబ్బందేమీ లేదు గానీ.. మాతోటి ఎన్యుమరేటర్లు చదువుకున్న వారితో వారు అడిగే ప్రశ్నలతో ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. సర్వే జరుగుతున్న సమయంలో అక్కడి తీరును పరిశీలిస్తూ ఫొటోలు తీసుకొని వెళ్లారని పలువురు ఎన్యుమరేటర్లు తెలిపారు. సమగ్ర కుటుంబ సర్వేలో వివరాలు వెల్లడించడానికి మెజార్టీ ఆసక్తి కనబర్చడం లేదని, సర్వేకు వెళ్లిన వారిలో ఏదో అరొకర వివరాలతో ఇవే అని చెప్పి పంపిస్తున్నారు. ఇదే సమయంలో రేషన్ కార్డు, సొంత ఇల్లు లేని వారు మాత్రం పూర్తివివరాలు ఇస్తూ అమ్మా మాకు ప్రభుత్వం నుంచి ఏమైనా పథకాలు ఇస్తారా అంటూ ఎంతో ఆసక్తిగా అడుగుతూ ఎన్యుమరేటర్లు అడిగిన అన్నీ ప్రశ్నలకు సమాధానాలు ఇస్తుండడం గమనార్హం.

## నేడు ధాత్రి కల్యాణం

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సర్దార్ పటేల్‌నగర్‌లోని లక్ష్మీగోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న పవిత్రోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యా యి. గోపూజకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. బుధవారం సాయంత్రం 5గంటల నుంచి ధాత్రి కల్యాణం ఉంటుందని ఆలయ కమిటీ నిర్వాహకులు కృష్ణారెడ్డి తెలిపారు.

---

పార్ట్‌టైం జాబ్ పేరుతో

## రూ.1.45లక్షలు లూటీ

హైదరాబాద్ సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ పార్ట్‌టైం జాబ్ పేరుతో సైబర్ నేరగాళ్లు రూ.1.45 లక్షలు కాజేశారు. నగరానికి చెందిన ప్రైవేటు ఉద్యోగి(25) ఆన్‌లైన్ పార్ట్‌టైం జాబ్ ప్రకటన చూసి వారిని సంప్రదించాడు. చిన్నపాటి టాస్క్‌లు చేస్తే డబ్బులు చెల్లిస్తామని చెప్పిన నేరగాళ్లు టెలిగ్రాం గ్రూపులో చేర్చారు. టాస్క్‌ల పేరుతో ఒక్కో సంస్థకు గూగుల్ రివ్యూలు ఇచ్చి, వాటిని స్క్రీన్‌షాట్ తీసి పంపమని కోరారు. డబ్బు చెల్లించేందుకని బ్యాంకు ఖాతా వివరాలు తీసుకున్నారు. నమ్మకం వచ్చేలా ముందుగా కొంత డబ్బు ఇచ్చిన కేటుగాళ్లు పెద్ద మొత్తంలో డబ్బు కావాలంటే ప్రతి టాస్క్‌కు డబ్బు చెల్లించాలని సూచించారు. వారి మాటలను నమ్మిన బాధితుడు పలు దఫాలుగా రూ.1.45 లక్షలు ఇచ్చాడు. వీఐపీ గ్రూపులో చేరాలని చెప్పడంతో బాధితుడు నిరాకరించగా అతడి ఖాతాను బ్లాక్ చేశారు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు.

## కులగణనలో అన్యాయం చేస్తే ఊరుకోం

- కార్పొరేటర్ నర్సింహయాదవ్



ఓల్డుబోయిన పల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కులగణన సర్వేలో బీసీలకు అన్యాయం జరిగితే సహించమని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. బీసీలను రిజర్వేషన్‌కు దూరం చేయాలనే కుట్ర జరుగుతోందన్నారు. కులగణన విషయాన్ని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు సమాచారం ఇవ్వకుండా ఏక పక్ష నిర్ణయం తీసుకోవడం సరైన నిర్ణయం కాదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.

---

## పెండింగ్ పనులు పూర్తి చేయాలి



దీనదయాల్‌నగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్, జోనల్ కమిషనర్

ఫతేనగర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఫతేనగర్ డివిజన్‌లో సమస్యలు తెలుసుకునేందుకు కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ మంగళవారం కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్‌తో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించారు. డివిజన్ పరిధిలోని దీనదయాల్‌నగర్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీ సబ్‌లైన్లు, సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాల్ నిర్మాణం తదితర పెండింగ్ పనులు, సమస్యలను వారు పరిశీలించారు. అనంతరం శోభనాకాలనీలోని అక్షయ్‌ఎన్‌క్లేవ్, గౌతమీనగర్ నాగార్జునా కాలనీలో పర్యటించారు. దీనదయాల్‌నగర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ. 25లక్షలు మంజూరయ్యాయని, పనులు తర్వగా పూర్తి చేయాలని కార్పొరేటర్ జడ్సీకి విన్నవించారు. ఫతేనగర్ డివిజన్‌లో పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు నిధులను మంజూరు చేస్తానని జెడ్సీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్కిల్ అధికారులు, డివిజన్ ఏఈ రాధాకృష్ణ, దీనదయాల్‌నగర్ బస్తీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కాసుల మహేందర్, కార్యదర్శి హరిబాబు, సతీష్, సలావుద్దీన్, లక్ష్మన్ సురేందర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## 'ఓటీఎస్'ను సద్వినియోగం చేసుకోండి



సిబ్బందికి నీటి బిల్లు చెల్లిస్తున్న వినియోగదారులు

అల్లాపూర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు ప్రవేశ పెట్టిన వన్ టైం సెటిల్‌మెంటు (ఓటీఎస్)ను వినియోగదారులు సద్వినియోగపర్చుకోవాలని జలమండలి అధికారి ఒకరు ఓ ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడిన అధికారి వినియోగదారుల సౌకర్యార్థం ఈపథకాన్ని నవంబరు 30వ తేదీ వరకు పొడిగించారని పేర్కొన్న ఆయన, ప్రాంతాల వారీగా నిర్దేశించిన సిబ్బందిని ఈ కింది విధంగా సంప్రదించాలని సూచించారు. శ్రీ వివేకానంద నగర్, జ్యోతి నగర్ వాసులు బిల్ కలెక్టర్ సంజీవను (ఫోన్ నెం. 9493311549), పర్వత్ నగర్, జనప్రియనగర్ అల్లాపూర్, న్యూ అల్లాపూర్, సెంట్రల్ అల్లాపూర్, ఫ్రెండ్స్ కాలనీ, కేజీఎస్ నగర్, లక్ష్మీనగర్, శివబస్తీ వాసులు బిల్ కలెక్టర్ విజయ్(ఫోన్ నెం.7981238321)ను, గాయత్రీనగర్, తులసి నగర్ కాలనీ వాసులు బిల్ కలెక్టర్ జశ్వంత్ (ఫోన్ నెం. 8328194770), పద్మావతి నగర్, మెరాజ్ నగర్, అజీజ్ నగర్ వాసులు నవీన్ (ఫోన్ నెం.9640053197)ను సంప్రదించాలని కోరారు.

## విశ్వకర్మ లీడర్ అవార్డుకు రామలింగాచారి ఎంపిక



విశ్వకర్మ లీడర్ అవార్డుకు ఎంపికైన రామలింగాచారి

ఓల్డుబోయినపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విశ్వకర్మ లీడర్ అవార్డుకు ఓల్డుబోయినపల్లి హస్మత్‌పేటకు చెందిన లోహశిల్పి పిట్లం రామలింగాచారి ఎంపికయ్యారు. ఇటీవల అయోధ్యా బాలరాముడికి పాదుకలు తయారు చేసి కంచు,రాగి, ఇత్తడి లోహశిల్ప నిర్మాణంలో అమోఘ ప్రతిభను, నైపుణ్యాన్ని కనబరుస్తూ దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఆయనను విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ చీఫ్ ఫౌండర్ విశ్వనాథుల పుష్పగిరి ఈ అవార్డుకు ఎంపిక చేశారు. బుధవారం సాయంత్రం 5 గంటలకు ఢిల్లీలోని డా. బీఆర్ అంబేడ్కర్ భవన్(ఏపీ, తెలంగాణ భవన్)లో ఈ అవార్డును ప్రముఖుల చేతుల మీదుగా అందజేయనున్నారు. అవార్డుకు ఎంపికైన రామలింగాచారికి పలువురు అభినందనలు తెలిపారు. అవార్డుకు ఎంపిక చేసిన విశ్వకర్మ నాలెడ్జ్ సెంట ర్ బృందానికి చారి కృతజ్ఞతలు తెలియజేశారు.

## టీడీపీ సభ్యత్వ నమోదుకు స్పందన



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో హరి సురేష్ బాబు తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నందమూరి సుహాసిని యువసేన అక్క ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టీడీపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభిస్తోందని నందమూరి సుహాసిని యువసేన అక్క అధ్యక్షుడు హరి సురేష్‌బాబు తెలిపారు. బాలాజీనగర్ డివిజన్ కేపీహెచ్‌బీలోని మహారాష్ట్ర బ్యాంక్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉద్యోగులు, వ్యాపారులు సభ్యత్వం తీసుకునేందుకు ముందుకొస్తున్నారన్నారు. తెలంగాణలో టీడీపీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు పార్టీ సభ్యత్వాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో నిమ్మగడ్డ అరూప్, వెంకట సుబ్బయ్య, చందర్‌రావు, రఘు కుమార్, రమేష్, బీవీ సుబ్బరాజు, వీకేవీ రాజు, శివరావు, వీఎస్‌ఎల్‌ఎన్ ప్రసాద్, విక్రమ్, వరుణ్ పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఓల్డుబోయినపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బోయినపల్లి డివిజన్ పరిధి హెచ్‌ఎంటీ 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతు పనుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని బోయినపల్లి డీఈ గోపాల్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ఒంటిగంట వరకు ఆర్ఆర్‌నగర్, ఏఎస్ఆర్ రెడ్డి కాంప్లెక్స్, హెచ్‌ఎంటీ సబ్‌స్టేషన్, ఎస్వీఎంఆర్ ఆర్కేడ్, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 7 వరకు హెచ్‌ఎంటీ మెయిన్ రోడ్డు, అయ్యప్ప స్వామి టెంపుల్ వైపు, ద్వారకా పురి కాలనీ, సీఎంఆర్ షాపింగ్ మాల్‌లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

## నాలా పనుల పరిశీలన



రామారావు నగర్‌లో నాలా పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబీహా బేగం

అల్లాపూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ రామారావు నగర్‌లో రూ. 2 కోట్లతో చేపట్టిన నాలా పనులను మంగళవారం కార్పొరేటర్ సబీహ బేగం పరిశీలించారు. 30సంవత్సరాలుగా నాలా పరిసరాల్లో నివసిస్తున్న వందలాది మంది నివాసితులు వానాకాలంలో వరదతో తమ ఇళ్లలోకి వరద నీరు చేరడంవల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఇప్పుడు నాలా నిర్మాణంతో ఆయా సమస్యలకు చెక్ పెట్టొచ్చని ఆమె పేర్కొన్నారు. పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. డీఈ, ఏఈ రంజిత్, వీరారెడ్డి, వెంకటయ్య యాదవ్, జ్ఞానేశ్వర్, రామిరెడ్డి, వెంకటరమణ, మహేశ్, శివ, యోగిరాజ్ స్వామి, ఉమ పాల్గొన్నారు.

## చిన్నారులకు ఆటల పోటీలు

ఓల్డుబోయినపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జాతీయ బాలల దినోత్సవా న్ని పురస్కరించుకొని ఓల్డుబోయినపల్లి డివిజన్ సమతానగర్‌లో 14 ఏళ్లలోపు చిన్నారులకు పలు ఆటల పోటీలు నిర్వహించారు. సమతానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. లెమన్ అండ్ స్పూన్ రేస్, స్లో సైక్లింగ్, ఉపన్యాసం, వ్యాసరచన, టగ్‌ఆఫ్‌వార్, బాల్ ఇన్ ద బాస్కెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 50 మందికి పైగా చిన్నారులు పాల్గొని ప్రతిభను ప్రదర్శించారు. విజేతలకు అసోసియేషన్ సభ్యులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు లోహిదాస్, కార్యదర్శి నాగేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడు రాంచందర్‌రావు, సహాయక కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, సహాయక కోశాధికారి పి.టి.వి రామకృష్ణ, మహిళా విభాగం సభ్యులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపండి



జేఎన్‌టీయూ రిజిస్ట్రార్‌తో సమావేశమైన కార్పొరేటర్ శ్రీనివాసరావు

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలోని వసతి గృహాల నుంచి వచ్చే డ్రైనేజీ వల్ల చాలా కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయని కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు అన్నారు. ఈమేరకు ఆయన మంగళవారం జేఎన్‌టీయూ ఆనుకొని ఉన్న భగత్‌సింగ్‌నగర్ ఫేజ్-1, ఆరోఫేజ్ వాసులతో కలిసి క్షేత్రస్థాయిలో డ్రైనేజీవల్ల పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. అనంతరం జలమండలి మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, ఆయా కాలనీల అసోసియేషన్లతో కలిసి జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, ఈఈ చంద్రశేఖర్‌తో సమావేశమై చర్చించారు. త్వరగా డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపాలని కార్పొరేటర్ జేఎన్‌టీయూ అధికారులకు విన్నవించారు.

---

## లారీ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఖైరతాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన సైఫాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ సురేష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం తెల్లవారుజామున ఇసుక లోడ్‌తో వెళ్తున్న లారీ పోలీస్ ట్రాఫిక్ కంట్రోల్ రూం నుంచి అసెంబ్లీ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వ్యక్తిని ఢీకొంది. దీంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న కంట్రోల్ రూం పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడికి 40 నుంచి 50 సంవత్సరాలు ఉంటాయని, 5.6 అడుగుల ఎత్తు ఉంటాడని, ఒంటిపై పసుపు రంగు చొక్కా, నీలి రంగు గళ్ల లుంగీ ధరించాడని పోలీసులు తెలిపారు.

## పెళ్లి పేరుతో యువతిని మోసం చేసిన యువకుడు

బంజారాహిల్స్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని చెప్పి ఓ యువకుడు తనను మోసం చేశాడని యువతి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రముఖ కళాశాలలో చదువుతున్న యువతికి ఏప్రిల్‌లో సోషల్ మీడియా ద్వారా శ్రీధర్ పరిచయం కాగా పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఈ క్రమంలో ఆమె గర్భం దాల్చడంతో అబార్షన్ చేయించాడు. ఇప్పుడు పెళ్లి చేసుకోవాలని అడిగితే నిరాకరిస్తున్నాడని.. అతడి కోసం తాను రూ.3 లక్షలు ఖర్చు చేశానంటూ జూబ్లీహిల్స్ పోలీసులకు యువతి ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## స్పాలో క్రాస్ మసాజ్

బంజారాహిల్స్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): క్రాస్ మసాజ్ చేస్తున్న పలువురిని పోలీసులు అరెస్ట్ చేసిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 10లోని మౌంటెన్ బ్యూటీ స్పాలో క్రాస్ మసాజ్ నడుస్తుందని బంజారాహిల్స్ పోలీసులకు సమాచారం అందడంతో ఈ నెల 11న దాడులు నిర్వహించారు. క్రాస్ మసాజ్ జరుగుతుందని నిర్ధారణ కావడంతో స్పా రిసెప్షనిస్ట్ పర్వీన్ బేగం, విటుడు దత్తా తన్నాజీ, ఐదుగురు యువతులను అదుపులోకి తీసుకోగా.. నిర్వాహకులు ప్రశాంత్, రవికుమార్ పరారీలో ఉన్నారు. నిందితుల నుంచి 9 మొబైల్ ఫోన్‌లు, స్వైప్ మెషీన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

## గొలుసు పోయిందని ఫిర్యాదు

బంజారాహిల్స్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆలయానికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్లే సమయంలో మెడలో బంగారు గొలుసు మాయమైంది. అత్తాపూర్‌కు చెందిన నూక రవి కొత్త ద్విచక్రవాహనం కొనుగోలు చేసి గత నెల 14న తన తల్లితో కలిసి జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి ఆలయానికి వాహన పూజ కోసం వెళ్లాడు. పూజ ముగించుకొని ఇంటికి వెళ్లి చూడగా రవి తల్లి మెడలో రూ.1.50 లక్షల విలువ చేసే గొలుసు కనిపించలేదు.

అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా.. జూబ్లీహిల్స్‌లో ఫిర్యాదు చేయమని సూచించడంతో కొన్ని కారణాలతో వారు అప్పుడు ఫిర్యాదు చేయలేదు. అయితే ఈ నెల 11న రవి ఫిర్యాదు చేయడంతో జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు.

## ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

రాయదుర్గం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి పోలీసు స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. వట్టినాగులపల్లిలో ఓ చెట్టుకు వ్యక్తి ఉరేసుకొని ఉండడాన్ని భూ యజమాని గమనించి వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. దాంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేయగా.. ఏపీలోని నెల్లూరు జిల్లాకు చెందిన మల్లి చెన్నయ్య ఉపాధి కోసం నగరానికి వచ్చి రామచంద్రాపురంలోని ఇంజనీర్స్ ఎన్‌క్లేవ్ కాలనీలో నివాసముంటున్నట్లుగా గుర్తించారు. ఆత్మహత్య గల కారణాలు తెలియలేదు. కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

## కలెక్టర్‌పై దాడిని ఖండిస్తూ నిరసన

హైదరాబాద్ సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా కలెక్టర్‌పై జరిగిన దాడిని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఉద్యోగులు ఖండించారు. ఈ ఘటనపై ఆందోళన వ్యక్తం చేస్తూ మంగళవారం ఉదయం కార్యాలయం ఎదుట ఉద్యోగులు, అధికారులు నిరసన చేపట్టారు.

కలెక్టర్‌పై దాడి చేయడం అమానుషమని ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్రీవాస్తవ అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.



కాలనీ నూతన వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో ఎమ్మెల్యే గాంధీ

## ఎమ్మెల్యే గాంధీని కలిసిన ప్రకాష్‌నగర్ కాలనీవాసులు

**మియాపూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):** హఫీజ్‌పేట డివిజన్ పరిధిలోని ప్రకాష్‌నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్‌కు నూతనంగా ఎన్నుకోబడిన కాలనీ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు మంగళవారం పీఏసీ ఛైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని మర్యాద పూర్వకంగా కలిశారు. అసోసియేషన్ సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. అందరూ కలిసికట్టుగా కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు.

కార్యక్రమంలో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు బాలింగ్ గౌతమ్‌గౌడ్, అధ్యక్షుడు పవన్‌గౌడ్, కోఆర్డినేటర్ బెనర్జీ, జనరల్ సెక్రటరీ శ్రీనివాస్‌గౌడ్, ట్రెజరర్ పరమేశ్వర్, అడ్వైజర్లు రమేష్‌గౌడ్, నరేందర్‌గౌడ్, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మధుయాదవ్‌తో పాటు పలువురు ఉన్నారు.



లబ్ధిదారుడి కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

## సీఎం సహాయనిధి చెక్కు అందజేత

**హైదర్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):** మాదాపూర్ డివిజన్ సాయినగర్‌కు చెందిన మోహన్‌నాయక్ అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నాడు. అతడికి మంజూరైన రూ.60 వేల చెక్కును మంగళవారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ లబ్ధిదారుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. పేద, మధ్యతరగతి ప్రజలు ఆస్పత్రి బిల్లులు కట్టలేని పరిస్థితిలో ఉన్న వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తూ ఆర్థిక సాయం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బాలింగ్ గౌతంగౌడ్ తదితరులు ఉన్నారు.

## డివిజన్ సమస్యలు పరిష్కరించాలి

**గచ్చిబౌలి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):** పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని సమస్యలపై మంగళవారం జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డిని కలిసి కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శాంతినగర్, బండ్లగూడ, బాలాజీనగర్, ఆల్విన్‌కాలనీ రోడ్లు వర్షానికి దెబ్బతిని పూర్తిగా పాడయ్యాయని దీనివల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, రోడ్లు వేయాలని కోరారు. దీనికి జడ్సీ సానుకూలంగా స్పందించినట్లు కార్పొరేటర్ తెలిపారు.



జడ్సీ ఉపేందర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ కుమార్‌యాదవ్



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

## రోడ్డు విస్తరణ పనుల పరిశీలన

**హైదర్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):** ఆల్విన్‌కాలనీ డివిజన్ ఉషాముళ్లపూడి ప్రధాన రహదారి ఎల్లమ్మచెరువు వద్ద జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను మంగళవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లమ్మ చెరువు వద్ద ప్రధాన రహదారిలో ఇటీవల జరుగుతున్న రోడ్డు విస్తరణ, పైపులైను నిర్మాణ పనులతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని, త్వరలో పనులు పూర్తి చేసి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# సొంత భవనం లేక అవస్థలు

- శిథిలావస్థలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్
- కోట్ల ఆదాయం వచ్చినా పట్టించుకోని అధికారులు

**చందానగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):** వంద కోట్ల రూపాయాల ఆదాయం వస్తున్నా.. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌కు సొంత భవనం లేదు. హైటెక్‌సిటీ, ఫైనాన్షియల్ జిల్లాకు కూతవేటు దూరంలో ఉన్న ఈ స్టేషన్ దుస్థితి అంతా ఇంతా కాదు. డ్రగ్స్ తరలిస్తుండగా దొరికిన వాహనాలను సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉంచారు. కనీసం కార్యాలయంలోకి వెళ్లడానికి కూడా దారిలేని పరిస్థితి ఉందంటే ఈ స్టేషన్ పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అదే శేరిలింగంపల్లి చందానగర్ హుడా కాలనీలోని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్. వివరాలోకి వెళ్లితే..

నాలుగు దశాబ్దాల క్రితం చందానగర్ లా అండ్ ఆర్డర్ పోలీస్‌స్టేషన్‌కు సొంత భవనం లేకపోవడంతో అద్దెకు భవనాన్ని తీసుకున్నారు. పోలీస్‌స్టేషన్ నిర్మించాక ఆ భవనాన్ని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ ఇరుకు భవనంలోనే ఎక్సైజ్ అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. ఆ భవనం శిథిలావస్థకు చేరడంతో అనేక సమస్యలు నెలకొన్నాయి. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు సొంత భవనం కోసం విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. అదిగో ఇదిగో అంటూ చివరిగా 2023లో గోపన్‌పల్లిలోని సర్వే నంబర్ 37లో 600 గజాల స్థలాన్ని కేటాయిస్తు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

కానీ శేరిలింగంపల్లి రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన సర్వే పత్రాలు అందిచడంలో ఆలస్యం జరుగుతుందని ఆరోపణలు నాటి నుంచి నేటి వరకు వినిపిస్తున్నాయి. శేరిలింగంపల్లి ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ స్టేషన్ పరిధిలో 39 వైన్స్‌లు, 139 బార్‌లు ఉన్నాయి. ఈ స్టేషన్‌లో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఒక హెడ్‌కానిస్టేబుల్స్ ఉండగా, 9 కానిస్టేబుళ్లకు నలుగురే ఉన్నారు. ఏళ్ల తరబడి అద్దె భవనం ఇరుకుగా ఉండటంతో సీజ్ చేసిన వాహనాలు పార్కింగ్ చేయడానికి కూడా స్థలం లేదు. వర్షాలకు స్టేషన్‌లోని వస్తువులు, ఫైల్స్ తడిచిపోయాయి.




పోలీస్‌స్టేషన్ ఆవరణలో సీజ్ చేసిన వాహనాలు, ఇన్‌సెట్‌లో పోలీస్‌స్టేషన్ బోర్డు

### మరో ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు

ఈ స్టేషన్ పరిధిలో మద్యం విక్రయాలు అధికంగా జరగడంతో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ల పెంపునకు ఉత్తర్వులు జారీ చేయడంతో మాదాపూర్, కొండాపూర్ డివిజన్ కలిపి మరో పోలీస్‌స్టేషన్ ఏర్పడనుంది. అయితే రెండుస్టేషన్లకు సొంత భవనాలు నిర్మిస్తారా? లేక అద్దె భవనాల్లో కొనసాగిస్తారా అనేది చర్చనీయాంశంగా మారింది. కనీసం స్టేషన్‌కు నలుగురు వస్తే కూర్చోవడానికి కూడా అవకాశం లేదు.

దీంతో సందర్శకులతో పాటు పోలీసులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి స్టేషన్‌కు కేటాయించిన స్థలంలో కొత్త భవనం నిర్మించాలని కోరుతున్నారు.

### సర్వే రిపోర్టు రావాలి



శేరిలింగంపల్లి మండల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌స్టేషన్‌కు గోపన్‌పల్లిలో 600 గజాల స్థలం కేటాయిస్తు 2023లో ఉత్తర్వులు ఇచ్చారు. కానీ సర్వే రిపోర్టు ఇంకా ఇవ్వలేదు. రిపోర్టు అందగానే నూతన భవన నిర్మాణం విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.

\- లక్ష్మణ్‌గౌడ్, ఇన్‌స్పెక్టర్



దీపోత్సవంలో ఆలయ కమిటీ ప్రతినిధులు

## ఘనంగా లక్షదీపోత్సవం

**చందానగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):** చందానగర్ శిల్పాఎన్‌క్లేవ్ లక్ష్మీగణపతి ఆలయ ప్రాంగణంలో కొనసాగుతున్న లక్షదిపోత్సవ కార్యక్రమం మంగళవారం కనులపండువగా జరిగింది. పలుకాలనీల నుంచి పెద్దసంఖ్యలో మహిళలు తరలివచ్చి ఈ దిపోత్సవంలో పాల్గొని దీపాలు వెలిగించారు. ముందుగా ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకం, అర్చనలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

**రాయదుర్గం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):** గచ్చిబౌలి పోలీసుస్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. వట్టినాగులపల్లిలో ఓ చెట్టుకు వ్యక్తి ఉరేసుకొని ఉండడాన్ని భూ యజమాని గమనించి వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. దాంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేయగా.. ఏపీలోని నెల్లూరు జిల్లాకు చెందిన మల్లి చెన్నయ్య ఉపాధి కోసం నగరానికి వచ్చి రామచంద్రాపురంలోని ఇంజనీర్స్ ఎన్‌క్లేవ్ కాలనీలో నివాసముంటున్నట్లుగా గుర్తించారు. ఆత్మహత్య గల కారణాలు తెలియలేదు. కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

# ప్రభుత్వ ఆస్పత్రులకు పెరుగుతున్న ఆదరణ

**గచ్చిబౌలి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజలకు ఆదరణ పెరుగుతుందని కొండాపూర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాగిణిరెడ్డి అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుపై ప్రజలకు మక్కువ పెరుగుతుందని అనడానికి అక్టోబరులో గతంలో ఎన్నడు లేనివిధంగా 278 ప్రసూతిలు జరిగాయని ఆమె వివరించారు. గతంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో మహిళలు డెలివరి చేయించుకోవాలంటే భయపడేవారని, పేదలు సైతం ఆస్పత్రివైపు చూసేవారు కాదని ఆమె అన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక చర్యల్లో భాగంగా ప్రజలు ఎక్కువ శాతం ప్రభుత్వ ఆస్పత్రుల వైపు వస్తున్నారని అన్నారు. అందులో 147 నార్మల్ డెలవరీలు, 67 డెలవరీ రాత్రిపూట నైట్‌డ్యూటీ వైద్యులు, సిబ్బంది చేతుల మీదుగా జరిగాయన్నారు. 2023లో 275 డెలవరీ చేయగా ప్రస్తుతం ఆ సంఖ్యను అదిగమించడం జరిగిందన్నారు. డెలివరీ కోసం వచ్చే మహిళలు, వారిఅటెండ్‌లకు సదుపాయాలు కల్పిస్తున్నామని, నార్మల్ డెలవరీలు చేసేందుకు కృషిచేస్తున్నామని తెలిపారు. తప్పనిసరి అయితే తప్ప సిజరింగ్‌లు చేస్తున్నామని, అతి తక్కువ కేసులను మాత్రమే నిలోఫర్‌కు పంపిస్తున్నామని తెలిపారు.



కొండాపూర్ ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి



లింగంపల్లి రైల్వేఅండర్ బ్రిడ్జి వద్ద జరుగుతున్న కల్వర్టు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్

## కల్వర్ట్ పనులను పూర్తిచేయాలి

**గచ్చిబౌలి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):** శేరిలింగంపల్లి డివిజన్ లింగంపల్లి బ్రిడ్జి వద్ద వరద ముంపునకు శాశ్వత పరిష్కారం దిశగా చేపడుతున్న బాక్స్ కల్వర్ట్ వరదనీటి కాల్వ పనులను జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగంపల్లి రైల్వేబ్రిడ్జి వద్ద వరదనీరు చేరి రాకపోకలు నిలిచిపోతున్నాయని, సమస్య పరిష్కారానికి బాక్స్ కల్వర్ట్, వరదనీటి కాల్వ పనులు వేగంగా నాణ్యత ప్రమాణాలతో పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. సమస్య శాశ్వత పరిష్కారం త్వరలోనే జరుగుతుందని, ప్రజలు ఇబ్బందులు తొలగుతాయని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు ఈఈ దుర్గాప్రసాద్, డీఈ ఆనంద్, ఏఈ భాస్కర్, స్థానికులు లక్ష్మణ్ యాదవ్, గోపాల్‌యాదవ్, సురేష్ రాథోడ్, శ్రీనివాస్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ స్టాఫ్ కళాశాలలో కన్వెన్షన్ సెంటర్ ప్రారంభం

**రాయదుర్గం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):** గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కళాశాల ప్రాంగణంలో జాతీయ, అంతర్జాతీయ సమావేశాలతో పాట వివిధ ప్రభుత్వ కార్యక్రమాలు, సభలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి వీలుగా నూతన కన్వెన్షన్ సెంటర్‌ను ప్రారంభించినట్లు కాలేజ్ డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వర్‌రావు తెలిపారు. 72 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో 800 సీట్ల సామర్థ్యంతో నిర్మించిన ఈ కన్వెన్షన్ సెంటర్ ఆడిటోరియంలో ప్రజంటేషన్స్, చిత్ర ప్రదర్శనలకు వీలుగా 28 అడుగుల వెడల్పు, 9 మీటర్ల నిలువు గల ఒక పెద్ద తెరను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డోల్బీ సౌండ్ సిస్టంతో ఏర్పాటు చేసిన ఈ ఆడిటోరియం సాంస్కృతిక కార్యక్రమాలకు కూడా అనువుగా ఉంటుందన్నారు. గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తులో నిర్మించిన ఈ కన్వెన్షన్ సెంటర్‌లో గ్రౌండ్ ఫ్లోర్‌లో ఆడిటోరియం, ఇండోర్ ఎగ్జిబిషన్ హాల్, 200మంది కూర్చునే విధంగా స్కైవ్యూ ఆడిటోరియంతో పాటుగా 500మంది భోజనం చేసే విధంగా డైనింగ్‌హాల్ ఏర్పాట్లు, మొదటి అంతస్తులో ఒక్కొక్కటి 50 సీట్ల సామర్థ్యం ఉన్న రెండు లెక్చర్ హాల్స్ రెండవ అంతస్తులో 150, 100 మంది కూర్చునే విధంగా నిర్మించిన రెండు సెమినార్‌హాల్స్, ప్రశాంతంగా కూర్చోవడానికి ఓపెన్ రూఫ్‌టాప్ కనోపి కూడా నిర్మించినట్లు ఆయన తెలిపారు. ఈ సెంటర్‌లో కావాలనుకునే వారు ఎస్కి వెబ్‌సైట్‌లో కానీ, మెయిల్ ద్వారా కానీ సంప్రదించాలని పేర్కొన్నారు.

# వియత్నాంకు విస్తరించిన ‘గీతం’ అధ్యాపకుడి సేవలు

- హోచిమిన్ సిటీలోని వియెన్ డాంగ్ కళాశాలలో రెండు వారాల పాటు ఆతిథ్య ఉపన్యాసాలు

**పటాన్‌చెరు రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):** ఇంతవరకు పరిశోధనలు చేపట్టడానికి విదేశాలకు వెళ్తున్న గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం అధ్యాపకులు ఇప్పుడు తమ వృత్తి నైపుణ్యాన్ని విదేశీ విద్యార్థులతో కూడా పంచుకుంటున్నారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, హైదరాబాద్‌లోని సీఎస్‌ఈ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నిరంజన్ అప్పస్వామి కృత్రిమ మేథ (ఏఐ)పై ఈనెల 10 నుంచి 24వ తేదీవరకు ఆతిథ్య ఉపన్యాసాలు ఇవ్వడానికి వియత్నాం హోచిమిన్ సిటీలోని వియెన్ డాంగ్ కళాశాలకు బయలుదేరి వెళ్లారు. అధ్యాపక వృత్తిలో 25 ఏళ్ల బోధనానుభవం గడించిన నిరంజన్ గతంలో నవంబరు 2022, 2023 రెండు విద్యా సంవత్సరాల్లో రెండువారాల పాటు వియెన్ డాంగ్ కళాశాల విద్యార్థులకు జావా, ఫ్లట్టర్‌లో ప్రయోగాత్మక శిక్షణ ఇచ్చారు. విద్యాపరమైన సహకారాన్ని పెంపొందించడం, మెరుగుపరచడంలో ఆయన నిబద్ధత, నైపుణ్యాలు వియత్నాం విద్యార్థులపై ప్రభావం చూపాయి. తన బోధనా బాధ్యతలతో పాటు, డాక్టర్ నిరంజన్ సైబర్ సెక్యూరిటీపై చేపట్టిన పరిశోధనా ప్రాజెక్టులో నిమగ్నమై ఉన్నారు. ఈ క్లిష్టమైన రంగంలో జ్ఞానాన్ని పెంపొందించడంలో అంకితభావాన్ని ప్రదర్శిస్తున్నారు. సైబర్ సెక్యూరిటీ, మెషిన్ లెర్నింగ్‌లో పీహెచ్‌డీని కలిగి ఉన్న ఆయన 21 పాఠ్య పుస్తకాలను రచించారు. ఐ ట్రిపుల్ ఈ సీనియర్ సభ్యుడిగా, 2024 ఐ ట్రిపుల్ ఈ కంప్యూటర్ సొసైటీ బెంగళూరు విభాగం కార్యనిర్వాహక సభ్యుడిగా డాక్టర్ నిరంజన్ సాంకేతిక పురోగతి, సైబర్ సెక్యూరిటీపై అవగాహనను పెంపొందించడంలో కీలక భూమిక పోషిస్తున్నారు. అదే చాప్టర్‌లో సైబర్ సెక్యూరిటీ స్పెషల్ టెక్నికల్ కమ్యూనిటీకి కార్యదర్శిగా కూడా పనిచేస్తున్నారు. నిరంజన్ బహుముఖ నైపుణ్యాలు విద్యారంగానికి మించి విస్తరించాయి. పోర్ట్రెయిట్, నేచర్ ఫొటోగ్రఫీ అంటే మక్కువ చూపడంతో పాటు బలమైన నెట్ వర్కింగ్ సామర్థ్యాలు, సానుకూలతలు ఆయన బోధన, పరిశోధనా కార్యక్రమాలకు మరింత శోభనిస్తున్నాయి. బహుముఖ ప్రజ్ఞతో కూడిన ఆయన అభిరుచి అంతర్జాతీయ విద్యార్థులకు అత్యాధునిక సాంకేతికతలకు పరిచయం చేయడమేగాక వారిని అనుసంధానించడానికి కూడా తోడ్పడుతోంది.



డాక్టర్ నిరంజన్ అప్పస్వామి



## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

**రాంనగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):** ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడడంతో తీవ్ర గాయాలకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మంగళవారం మృతి చెందాడు. అతడి మృతితో రాంనగర్‌లో తీవ్ర విషాదఛాయలు నెలకొన్నాయి. రాంనగర్‌లోని రామాలయం ప్రాంతంలో నివాసం ఉంటున్న జి.ప్రవీణ్(20) గత ఆదివారం మలక్‌పేటలో జరిగే ఫంక్షన్‌కు హాజరయ్యేందుకు రాంనగర్ నుంచి బైక్‌పై బయలుదేరాడు. మూసారాంబాగ్ బ్రిడ్జి స్పీడ్ బ్రేకర్ వద్ద బైక్ అదుపుతప్పి ప్రవీణ్ కిందపడ్డాడు. దీంతో అతడి తలకు బలమైన గాయమైంది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారంతో చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న ప్రవీణ్ మంగళవారం మృతి చెందాడు. దీంతో అతడి స్నేహితులు, కుటుంబ సభ్యులు కన్నీటి పర్యాంతమయ్యారు. ప్రవీణ్ మృతితో తల్లిదండ్రులు, బంధువులు కన్నీటిపర్యాంతమయ్యారు.

## ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

**చిక్కడపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):** ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక మానసికంగా కృంగిపోయిన ఓ వ్యక్తి గుర్తుతెలియని విషంతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ మౌనిక తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిక్కడపల్లి వివేక్‌నగర్‌కు చెందిన శ్రావణ్‌కుమార్(34) ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తూ భార్య, మూడు సంవత్సరాల కొడుకు, తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్నాడు. ఆయన తండ్రి నర్సిములు సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నారు. సోమవారం సాయంత్రం చిక్కడపల్లిలో నివసించే శ్రావణ్‌కుమార్ సోదరి ఇంటికి కుటుంబ సభ్యులంతా ఫంక్షన్‌కు వెళ్లారు. కాగా రాత్రి శ్రావణ్‌కుమార్ తిరిగి ఇంటికి చేరుకున్నాడు.

గుర్తుతెలియని విషంతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం 8 గంటల సమయంలో అతడి కుటుంబసభ్యులు ఇంటికి తిరిగి వచ్చి తలుపు తట్టడంతో ఎంతకూ తీయకపోవడంతో కిటికీలోంచి తలుపు తెరిచి లోనికి వెళ్లి చూ డగా శ్రావణ్‌కుమార్ మృతి చెంది ఉన్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## గొలుసు పోయిందని పోలీసులకు ఫిర్యాదు

**బంజారాహిల్స్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):** ఆలయానికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్లే సమయంలో మెడలో బంగారు గొలుసు మాయమైంది. అత్తాపూర్‌కు చెందిన నూక రవి కొత్త ద్విచక్రవాహనం కొనుగోలు చేసి గత నెల 14న తన తల్లితో కలిసి జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి ఆలయానికి వాహన పూజ కోసం వెళ్లాడు. పూజ ముగించుకొని ఇంటికి వెళ్లి చూడగా రవి తల్లి మెడలో రూ.1.50 లక్షల విలువ చేసే గొలుసు కనిపించలేదు. అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా.. జూబ్లీహిల్స్‌లో ఫిర్యాదు చేయమని సూచించడంతో కొన్ని కారణాలతో వారు అప్పుడు ఫిర్యాదు చేయలేదు. ఈ నెల 11న రవి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

## పార్ట్‌టైం జాబ్ పేరుతో రూ.1.45 లక్షలు లూటీ

**హైదరాబాద్ సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):** ఆన్‌లైన్ పార్ట్‌టైం జాబ్ పేరుతో సైబర్ నేరగాళ్లు రూ.1.45 లక్షలు కాజేశారు. నగరానికి చెందిన ప్రైవేటు ఉద్యోగి(25) ఆన్‌లైన్ పార్ట్‌టైం జాబ్ ప్రకటన చూసి వారిని సంప్రదించాడు. చిన్నపాటి టాస్క్‌లు చేస్తే డబ్బులు చెల్లిస్తామని చెప్పిన నేరగాళ్లు టెలిగ్రాం గ్రూపులో చేర్చారు. టాస్క్‌ల పేరుతో ఒక్కో సంస్థకు గూగుల్ రివ్యూలు ఇచ్చి, వాటిని స్ర్కీన్‌షాట్ తీసి పంపమని కోరారు. డబ్బు చెల్లించేందుకని బ్యాంకు ఖాతా వివరాలు తీసుకున్నారు. నమ్మకం వచ్చేలా ముందుగా కొంత డబ్బు ఇచ్చిన కేటుగాళ్లు పెద్ద మొత్తంలో డబ్బు కావాలంటే ప్రతి టాస్క్‌కు డబ్బు చెల్లించాలని సూచించారు. వారి మాటలను నమ్మిన బాధితుడు పలు దఫాలుగా రూ.1.45 లక్షలు ఇచ్చాడు. వీఐపీ గ్రూపులో చేరాలని చెప్పడంతో బాధితుడు నిరాకరించగా అతడి ఖాతాను బ్లాక్ చేశారు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు.

## లారీ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

**ఖైరతాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):** లారీ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన సైఫాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ సురేష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం తెల్లవారుజామున ఇసుక లోడ్‌తో వెళ్తున్న లారీ పోలీస్ ట్రాఫిక్ కంట్రోల్ రూం నుంచి అసెంబ్లీ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వ్యక్తిని ఢీకొంది. దీంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న కంట్రోల్ రూం పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడికి 40 నుంచి 50 సంవత్సరాలు ఉంటాయని, 5.6 అడుగుల ఎత్తు ఉంటాడని, ఒంటిపై పసుపు రంగు చొక్కా, నీలి రంగు గళ్ల లుంగీ ధరించాడని పోలీసులు తెలిపారు.

## పెళ్లి పేరుతో యువతిని మోసం చేసిన యువకుడు

**బంజారాహిల్స్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):** పెళ్లి చేసుకుంటానని చెప్పి ఓ యువకుడు తనను మోసం చేశాడని యువతి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రముఖ కళాశాలలో చదువుతున్న యువతికి ఏప్రిల్‌లో సోషల్ మీడియా ద్వారా శ్రీధర్ పరిచయం కాగా పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఈ క్రమంలో ఆమె గర్భం దాల్చడంతో అబార్షన్ చేయించాడు. ఇప్పుడు పెళ్లి చేసుకోవాలని అడిగితే నిరాకరిస్తున్నాడని.. అతడి కోసం తాను రూ.3 లక్షలు ఖర్చు చేశానంటూ జూబ్లీహిల్స్ పోలీసులకు యువతి ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## స్పాలో క్రాస్ మసాజ్

**బంజారాహిల్స్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):** క్రాస్ మసాజ్ చేస్తున్న పలువురిని పోలీసులు అరెస్ట్ చేసిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 10లోని మౌంటెన్ బ్యూటీ స్పాలో క్రాస్ మసాజ్ నడుస్తుందని బంజారాహిల్స్ పోలీసులకు సమాచారం అందడంతో ఈ నెల 11న దాడులు నిర్వహించారు. క్రాస్ మసాజ్ జరుగుతుందని నిర్ధారణ కావడంతో స్పా రిసెప్షనిస్ట్ పర్వీన్ బేగం, విటుడు దత్తా తన్నాజీ, ఐదుగురు యువతులను అదుపులోకి తీసుకోగా.. నిర్వాహకులు ప్రశాంత్, రవికుమార్ పరారీలో ఉన్నారు. నిందితుల నుంచి 9 మొబైల్ ఫోన్‌లు, స్వైప్ మెషీన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

# ఇక్కడ 365 రోజులూ ఇంతే!

● సూరారం కాలనీలో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ

- సమస్యకు పరిష్కారమెప్పుడు?
- ఇది ముమ్మాటికీ వాటర్‌వర్క్స్ అధికారుల నిర్లక్ష్యమే.
- మురుగు వాసన, దోమలతో నరకం చూస్తున్నాం : స్థానికుల ఆందోళన



జీడిమెట్ల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): . అవును ఇది ముమ్మాటికీ వాటర్‌వర్క్స్ అధికారుల నిర్లక్ష్యమే. సంవత్సరంలో 365రోజులు డ్రైనేజీ పొంగకుండా ఉన్న రోజంటూ లేదు. ఏళ్ల తరబడి ఇక్కడ నివసిస్తున్న స్థానికుల వెతలు అన్నీ ఇన్నీకావు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు. డ్రైనేజీ వ్యవస్థ జీహెచ్ఎంసీ నుంచి వాటర్‌వర్క్స్‌కు బదలాయింపు జరిగినప్పటి నుంచి కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్వహణ అధ్వాన్నంగా తయారైందని స్థానికులు బాహాటంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పురాతన కాలంలో వేసిన పైప్‌లైన్‌లే నేటికి ఉండటంతో పెరిగిన జనాభాకు అనుగుణంగా పైప్‌లైన్ కెపాసిటీ సరిపోకపోవడంతో మురుగునీరు నిత్యం రోడ్లపైనే పారుతుంది. కుత్బుల్లాపూర్ సర్కిల్ సుభాష్‌నగర్ డివిజన్ సూరారంకాలనీ ప్రధాన రహదారిపై పొంగిపొర్లుతున్న డ్రైనేజీ వ్యవస్థను ఆంధ్రజ్యోతి పరిశీలించింది.

సుభాష్‌నగర్ డివిజన్ సూరారంకాలనీలో లక్షల మంది జనాభా నివసిస్తున్నారు. నివాసాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అధికారులు విఫలమవుతున్నారు. ప్రధానంగా మొదటి ఓంజెండా సమీపంలో కూరగాయాల మార్కెట్, షాపులు నిర్వహిస్తుంటారు. మార్కెట్ ప్రాంతంలో కొన్ని సంవత్సరాలుగా డ్రైనేజీ వ్యవస్థ దారుణంగా మారడంతో మురుగునీరు పొంగిపొర్లుతుంది. దీంతో మార్కెట్‌కు వచ్చే ప్రజలు, ఈ రోడ్డు ప్రయాణించే వారు మురికినీటితో నరకం చూస్తున్నారు. ఈ విషయంలో ప్రజాప్రతినిధులు, వాటర్ వర్క్స్ అధికారులు సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. చీకటిపడితే దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి.దోమలు కుట్టి అనేక మంది విషజ్వరాల బారిన పడి, ఆస్పత్రుల పాలవుతున్నారు. స్థానికులు అనేకమార్లు ప్రజావాణిలో ఫిర్యాదు కూడా చేశారు. అలాగే స్థానిక కార్పొరేటర్‌కు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోకపోతే పెద్దఎత్తున ఉద్యమిస్తామని స్థానిక మహిళలు పేర్కొంటున్నారు.



పొంగిపొర్లుతున్న డ్రైనేజీ, రోడ్లపై నిలిచిన మురుగునీరు

### నిత్యం నరకం చూస్తున్నాం

ఇక్కడ 365 రోజులు మురికినీరు రోడ్డుపైన పారుతున్నది. డ్రైనేజీ వాసనతో నిత్యం నరకం చూస్తున్నాం. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా కనీసం వచ్చి చూసిన పాపాన పోవడం లేదు. అంటువ్యాధులు ప్రబలి ఆసుపత్రుల పాలవుతున్నాం. తక్షణమే సమస్య పరిష్కరించాలి.



- అనిత, స్థానికురాలు

### పట్టించుకోవడం లేదు

నిత్యం వేలాదిమంది ప్రయాణించే ఈ రోడ్డు మురికినీటితో అధ్వానంగా మారింది. డ్రైనేజీ నీరు నిల్వ ఉండటంతో దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. వాసన భరించలేక చచ్చిపోతున్నాం. ప్రజాప్రతినిధులు వస్తున్నారు, పోతున్నారే తప్పా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టడం లేదు.



- షబాన బేగం

### రూ.47 లక్షలతో అంచనాలు పంపించాం

సూరారంకాలనీ ప్రధాన రహదారిపై పొంగిపొర్లుతున్న డ్రైనేజీ పరిస్థితిపై స్థానిక వాటర్‌వర్క్స్ మేనేజర్ మల్లేశ్వర్‌రావును ప్రశ్నించగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య మా దృష్టికి వచ్చింది. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి అనేకసార్లు తీసుకువెళ్లామని, 47 లక్షల ఎస్టిమేట్‌తో ఉన్నతాధికారులకు సమర్పించాం. ఇప్పటి వరకు అధికారుల నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. నిధులు మంజూరైన వెంటనే టెండర్ పిలిచి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని చెప్పారు.

- మల్లేశ్వరరావు, సూరారం డివిజన్ వాటర్‌వర్క్స్ మేనేజర్

## మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలి

● ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

గాజులరామారం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం శ్రద్ధ చూపాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. గాజులరామారం డివిజన్‌లోని చింతల చెరువు, పెద్ద చెరువులో మత్స్యశాఖాధికారులు, నాయకులతో కలిసి చెరువులోని చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధి కోసం గత ప్రభుత్వ హయాంలో చెరువులో మురుగు నీరు కలువకుండా ఎస్టీపీలను నిర్మించి మంచి నీటిని శుద్ధి చేసి, మంచి చేపలు చెరువులో లభ్యమయ్యే విధంగా చేశారని. దీని వల్ల తాజా చేపలు లభించడమే కాకుండా చుట్టూ ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడే విధంగా చూశారన్నారు. అలాగే ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి మార్చాలని అసెంబ్లీలో ఇప్పటికే ప్రయత్నించడం జరిగిందని, వారి జీవ విధానాన్ని పెంచేందుకు నా తోడ్పాటు ఎప్పుడూ ఉంటుందన్నారు.

### మూడు ఎల్‌ఓసీ చెక్కుల అందజేత

కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన ముగ్గురు నివాసితులు అనారోగ్యంతో బాధపడుతూ, వైద్య ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను ఆశ్రయించగా సీఎం సహాయనిధి నుంచి రూ.4లక్షల 55వేలను మంజూరు చేయించి 3 ఎల్‌ఓసీ చెక్కులను మంగళవారం పేట్‌బషీరాబాద్ క్యాంప్ కార్యాలయంలో లబ్దిదారులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ సహాయనిధి పేదరికంతో బాధపడుతూ, వైద్యం చేయించుకోలేని నిరుపేదలకు ఆరోగ్య భద్రత కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో-ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, డైరెక్టర్లు కె.రాము, సత్యవతి, లక్ష్మణ్, జిల్లా మత్స్య శాఖాధికారులు, కీర్తి, గాజులరామారం మత్స్య సహకారసంఘం అధ్యక్షులు యాదగిరి, డివిజన్ అధ్యక్షుడు విజయ్‌రామిరెడ్డి, కమలాకర్, చెట్ల వెంకటేష్, శ్రీనివాస్, దుర్గయ్య పాల్గొన్నారు.



చింతల్ చెరువులో చేపలను వదులుతున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

### కార్తీక శోభ

కార్తీకమాస పూజల్లో భాగంగా సూరారం ఉమామహేశ్వర దేవాలయంలో సోమవారం రాత్రి శివునికి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ముద్దాపురం మదన్‌గౌడ్ నేతృత్వంలో జ్యోతిర్లింగార్చన జరిగింది. తొలుత కళాకారులచే కోలాట కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

- షాపూర్‌నగర్ (ఆంధ్రజ్యోతి)



### ఉత్సవాలకు ఆహ్వానం

చింతల్ డివిజన్, హెచ్ఎంటీ కాలనీలోని హజరత్ జిందా షా మదార్ రెహ్మాతుల్లా అలే ఉర్సు ఉత్సవాలకు హాజరు కావాలని రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కేఎం ప్రతాప్‌ను కుత్బుల్లాపూర్ గ్రామం, ఆయన నివాసంలో దర్గా కమిటీ సభ్యులు కలిసి ఆహ్వానపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ ఖాదర్, షేక్ బాబూమియా, మహ్మద్ గౌస్, హంసర్, వాజీద్, జావేద్, సమీర్ పాల్గొన్నారు.

- దుండిగల్ (ఆంధ్రజ్యోతి)



### 18 నుంచి బతుకమ్మబండలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

దేవేందర్‌నగర్ బతుకమ్మబండలోని శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఈ నెల 18 నుంచి 20వరకు నిర్వహించనున్నట్టు పురోహితుడు పరమేశ్వర పంతులు తెలిపారు. ఉదయం నుంచి గణపతి పూజలు, శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి, పరమేశ్వరస్వామి, దత్తాత్రేయ స్వామి, నవగ్రహ, గజస్తంభ మహోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

- గాజులరామారం (ఆంధ్రజ్యోతి)

### క్రిస్టియన్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం



సమావేశంలో పాల్గొన్న చర్చి పాస్టర్లు

నిజాంపేట్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): క్రిస్టియన్ కమ్యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ (సీసీడబ్ల్యూఏ) జనరల్ బాడీ సమావేశం నిజాంపేట్ కార్పొరేషన్‌లోని సీజీఎం చర్చి పాస్టర్ సీమోన్ మందిరంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా క్రిస్టియన్ కమ్యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులను సమావేశంలో పరిచయం చేశారు. పాస్టర్ జీవన్ ప్రకాష్ వాక్యోపదేశం చేశారు. ఈ సమావేశంలో ఆర్ యెహోషువా జగదీక కుమార్, ఎం. జామువాతో పాటు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని దాదాపు 40 మందికి పైగా పాస్టర్లు పాల్గొన్నారు.

### రక్తదాన శిబిరం

నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లిలోని గోకరాజురంగరాజు కళాశాలలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో విద్యార్థిని, విద్యార్థులతో పాటు ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ పద్మ, డైరెక్టర్ మూర్తి, ప్రిన్సిపల్ ప్రవీణ్ పాల్గొన్నారు.

- నిజాంపేట్ (ఆంధ్రజ్యోతి)



### సమస్యకు పరిష్కారం

ఎన్ని రోజులు ఎలా వదిలేస్తారు? అని 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి స్పందించి మెట్కాన్‌గూడలో కృంగిపోయిన మ్యాన్‌హోల్‌కు మంగళవారం మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేపట్టారు. దీంతో ప్రమాదంగా మారిన మ్యాన్‌హోల్ సమస్య పరిష్కారమైనందుకు గ్రామవాసులు హర్షం వ్యక్తం చేశారు. - షాపూర్‌నగర్ (ఆంధ్రజ్యోతి)



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

## వేగంగా సాగుతున్న రహదారి విస్తరణ పనులు

షాపూర్‌నగర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రధాన రహదారుల విస్తరణలో భాగంగా కుత్బుల్లాపూర్‌లో జరుగుతున్న విస్తరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. నియోజకవర్గంలోని షాపూర్‌నగర్, గాజులరామారం చౌరస్తా వద్ద ప్రధాన రహదారి విస్తరణ ఇరుపైపుల ఇప్పటికే ఒకవైపు పనులు పూర్తికాగ మరోవైపు పనులు కొనసాగుతున్నాయి. కూడళ్లను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ చౌరస్తాలో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, గడచిన రెండు నెలల్లో ఇక్కడ రెండు ప్రమాదాలు జరిగి ఇద్దరు మృత్యువాత పడిన సంగతి విదితమే. ఈ సంఘటనలతో చౌరస్తా ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. దీంతో ట్రాఫిక్‌ను తగ్గించేందుకు విస్తరణ పనులు మొదలు పెట్టారు. ఇక్కడే ఫుట్‌పాత్ బ్రిడ్జిని కూడా నిర్మించారు. నిత్యం రద్దీగా ఉండే ఈ చౌరస్తాను అభివృద్ధి పరిచేందుకు నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఇక్కడ ఉన్న ఇందిరాగాంధీ, రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలను తొలగించి ఈఎస్ఐ ఆస్పత్రి ఎదురుగా ఏర్పాటుచేశారు. కూడలి అభివృద్ధి తర్వాతైనా ట్రాఫిక్ తగ్గుతుందేమోనని పలువురు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.



ఈఎస్ఐ ఆస్పత్రి ముందు ఏర్పాటుచేసిన ఇందిరా గాంధీ, రాజశేఖర్‌రెడ్డిల విగ్రహాలు



రోడ్డు విస్తరణ పనులు

### కులగణనపై చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

జీడిమెట్ల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కులగణనపై ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని బీసీ హక్కుల పోరాటసమితి నాయకులు డిమాండ్ చేశారు. నేడు షాపూర్‌నగర్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ కులగణన చేస్తే అనైక్యత వస్తుందని రాంచీ ఎన్నికల ప్రచారంలో ప్రధాని వ్యాఖ్యానించడం, ఆయనకు బీసీలపై ఉన్న విద్వేషం కనిపిస్తొందన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ జనాభాలో 8శాతం లేని అగ్రవర్ణాలకు, పేదలు అనే పేరుతో 10శాతం రిజర్వేషన్లు ఇచ్చారని, కులగణన జరిగితే 80శాతం ఉన్న బీసీలు తమ జనాభా ప్రాతిపదికన వాటా అడుగుతారని, రాజకీయంగా ఎదుగుతారని భయపడుతున్నారన్నారు.

చివరిగా రాజ్యాధికారం చేపట్టే అవకాశాలు ఉండటంతో కులగణను వ్యతిరేకిస్తున్నారన్నారు. బీసీలు తమ వాటా కోసం రాజకీయాలకు అతీతంగా ఉద్యమించాలన్నారు. ఈ సమావేశంలో బీసీ హక్కుల సాధన సమితి నాయకులు స్వామి, సీపీఐ నియోజకవర్గం కార్యదర్శి ఉమామహేష్, నాయకులు మల్లేష్, శ్రీనివాస్, నర్సింహ, అశోక్, ప్రసాద్ పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

## ప్రభుత్వ భూమిని కాపాడాలి : సీపీఐ



డిప్యూటీ తహసీల్దార్ ప్రభుదాస్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న సీపీఐ నాయకులు

నిజాంపేట్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్ నిజాంపేట్ గ్రామంలోని ప్రభుత్వ భూమి సర్వే నంబరు 109లో భూమి ఆక్రమించి, అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని బాచుపల్లి మండల సీపీఐ కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్, మండల డిప్యూటీ తహశీల్దార్ ప్రభుదాస్‌కు మంగళవారం ఫిర్యాదు చేస్తూ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాచుపల్లి మండల పరిధిలో పలు ప్రదేశాల్లో ప్రభుత్వ భూమిని ఆక్రమించడం కబ్జాదారులు అలవాటుగా చేసుకున్నారన్నారు. దీనిపై చాలాసార్లు జిల్లా కలెక్టర్, మండల తహశీల్దార్, మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని చెప్పారు. కానీ పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. కాబట్టి ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు కబ్జాకు గురవుతున్న ప్రభుత్వభూమిని కాపాడటంతో పాటు అక్రమ నిర్మాణాలను కూల్చివేసి స్వాధీనం చేసుకోవాలన్నారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే పేద ప్రజలతో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సీపీఐ నాయకులు ఆశి యాదయ్య, వాసు, డీల్లీశ్వర్‌రావు ఉన్నారు.

### పార్ట్‌టైం జాబ్ పేరుతో రూ.1.45 లక్షలు లూటీ

హైదరాబాద్ సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ పార్ట్‌టైం జాబ్ పేరుతో సైబర్ నేరగాళ్లు రూ.1.45 లక్షలు కాజేశారు. నగరానికి చెందిన ప్రైవేటు ఉద్యోగి(25) ఆన్‌లైన్ పార్ట్‌టైం జాబ్ ప్రకటన చూసి వారిని సంప్రదించాడు. చిన్నపాటి టాస్క్‌లు చేస్తే డబ్బులు చెల్లిస్తామని చెప్పిన నేరగాళ్లు టెలిగ్రాం గ్రూపులో చేర్చారు. టాస్క్‌ల పేరుతో ఒక్కో సంస్థకు గూగుల్ రివ్యూలు ఇచ్చి, వాటిని స్క్రీన్‌షాట్ తీసి పంపమని కోరారు. డబ్బు చెల్లించేందుకని బ్యాంకుఖాతా వివరాలు తీసుకున్నారు. నమ్మకం వచ్చేలా ముందుగా కొంత డబ్బు ఇచ్చిన కేటుగాళ్లు పెద్ద మొత్తంలో డబ్బు కావాలంటే ప్రతి టాస్క్‌కు డబ్బు చెల్లించాలని సూచించారు.వారి మాటలను నమ్మిన బాధితుడు పలు దఫాలుగా రూ.1.45 లక్షలు ఇచ్చాడు. వీఐపీ గ్రూపులో చేరాలని చెప్పడంతో బాధితుడు నిరాకరించగా అతడి ఖాతాను బ్లాక్ చేశారు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు.

### రిజిస్ట్రేషన్లను పునరుద్ధరించాలి

కుత్బుల్లాపూర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ ప్రాంతంలో ప్రైవేటు భూములపై వక్ఫ్‌బోర్డు పెత్తనం ఏమిటని ఆకుల సతీష్ ప్రశ్నించారు. సర్వే నంబర్ 58-226 వరకు వక్ఫ్‌బోర్డు భూములంటూ రిజిస్ట్రేషన్ అధికారులు 168 సర్వే నంబర్లలో దాదాపు 12 వందల ఎకరాల్లో నిషేధం విధించడాన్ని తప్పుపట్టారు. ఆయన మంగళవారం చింతల్‌లోని అంబేద్కర్ విగ్రహానికి బీజేపీ నాయకులు నల్లా జయశంకర్‌గౌడ్‌తో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. 41 గుంటల భూమి కోసం ఇన్ని సర్వే నంబర్లలో రిజిస్ట్రేషన్లు నిలిపివేయడం అన్యాయమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. తక్షణమే నిషేధాన్ని ఎత్తివేసి రిజిస్ట్రేషన్లను చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో చందు, శ్యాంకుమార్‌రెడ్డి, అరుణ్‌రావు, కుమార్‌గౌడ్, తేజ, మనీష్, దిలీప్ పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించి, నిరసన తెలుపున్న నాయకులు

### స్పాలో క్రాస్ మసాజ్

బంజారాహిల్స్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): క్రాస్ మసాజ్ చేస్తున్న పలువురిని పోలీసులు అరెస్ట్ చేసిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 10లోని మౌంటెన్ బ్యూటీ స్పాలో క్రాస్ మసాజ్ నడుస్తుందని బంజారాహిల్స్ పోలీసులకు సమాచారం అందడంతో ఈ నెల 11న దాడులు నిర్వహించారు. క్రాస్ మసాజ్ జరుగుతుందని నిర్ధారణ కావడంతో స్పా రిసెప్షనిస్ట్ పర్వీన్ బేగం, విటుడు దత్తాత్రేయ్ జీ, ఐదుగురు యువతులను అదుపులోకి తీసుకోగా.. నిర్వాహకులు ప్రశాంత్, రవికుమార్ పరారీలో ఉన్నారు. నిందితుల నుంచి 9 మొబైల్ ఫోన్‌లు, స్వైప్ మెషీన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

### లారీ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఖైరతాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన సైఫాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ సురేష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం తెల్లవారుజామున ఇసుక లోడ్‌తో వెళ్తున్న లారీ పోలీస్ ట్రాఫిక్ కంట్రోల్ రూం నుంచి అసెంబ్లీ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వ్యక్తిని ఢీకొంది. దీంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న కంట్రోల్ రూం పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడికి 40 నుంచి 50 సంవత్సరాలు ఉంటాయని, 5.6 అడుగుల ఎత్తు ఉంటాడని, ఒంటిపై పసుపు రంగు చొక్కా, నీలి రంగు గళ్ల లుంగీ ధరించాడని పోలీసులు తెలిపారు.

### పెళ్లి పేరుతో యువతిని మోసం చేసిన యువకుడు

బంజారాహిల్స్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని చెప్పి ఓ యువకుడు తనను మోసం చేశాడని యువతి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రముఖ కళాశాలలో చదువుతున్న యువతికి ఏప్రిల్‌లో సోషల్ మీడియా ద్వారా శ్రీధర్ పరిచయం కాగా పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఈ క్రమంలో ఆమె గర్భం దాల్చడంతో అబార్షన్ చేయించాడు. ఇప్పుడు పెళ్లి చేసుకోవాలని అడిగితే నిరాకరిస్తున్నాడని.. అతడి కోసం తాను రూ.3 లక్షలు ఖర్చు చేశానంటూ జూబ్లీహిల్స్ పోలీసులకు యువతి ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### కార్తీకమాస పూజలకు మాజీ ఎమ్మెల్యేకు ఆహ్వానం

షాపూర్‌నగర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా శ్రీనల్లగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జరుగుతున్న కార్తీకమాస పూజలకు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ను ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. మంగళవారం షాపూర్‌నగర్‌లోని కూన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వానపత్రాన్ని అందజేశారు. ఈనెల 15న ఆలయంలో జరిగే పూజల్లో అభిషేకం, అర్చన సామూహిక సత్యన్నారాయణ వ్రతానికి హాజరుకావాలని కోరారు. అనంతరం పలు బస్తీల సంక్షేమ సంఘం నాయకులు బస్తీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాలను అందజేశారు. ఈ మేరకు స్పందించిన ఆయన అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో బస్తీల నాయకులు, సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



శ్రీశైలంగౌడ్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

### సమస్యల పరిష్కారానికి కృషి

● కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ

దుండిగల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి ఒక ప్రజా ప్రతినిధిగా తన వంతు కృషి చేస్తున్నానని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు, మల్లంపేట కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ ప్రజలతో పాటు నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలకు చెందిన ప్రజలు, తమ కాలనీల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లో సమస్యలను సాధ్యమైనంత వరకు పరిష్కరిస్తున్నామని, ప్రస్తుతం మీరు ఇచ్చిన వినతి పత్రాలు ద్వారా సమస్యలను గుర్తించి, సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించడానికి ప్రయత్నిస్తామని వారికి హామీ ఇచ్చారు.



ప్రజల నుంచి వచ్చిన వినతి పత్రాలను పరిశీలిస్తున్న కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గాజులరామారం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గాజులరామారం సబ్-స్టేషన్ పరిధిలోని 11 కేవీ, కైలాస్‌హిల్స్, శంషీగూడ సబ్-స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా ఉదయం 11 గంటల నుంచి 4 గంటల వరకు మహాదేవపురం, బాలయ్యబస్తీ, షిరిడీహిల్స్, కైలాస్ హిల్స్, ఐశ్వర్య ఎస్టేట్ ప్రాగా టూల్స్ నందిని హిల్స్‌లో విద్యుత్‌ను నిలిపి వేస్తున్నట్లు ఏఈ చైతన్య భార్గవ్ ఒక ప్రకటనలో తెలిపారు.